ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం చినగరువు గ్రామంలో సెయింట్ లూథరన్ మందిర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నప్పుడు నమ్మకంతో ఏసుక్రీస్తు ప్రభువును ప్రార్థిస్తే సమస్యలు తొలగిపోతాయన్నారు. ఏసుక్రీస్తు ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. గ్రామస్తులంతా కలిసి నూతన చర్చిని నిర్మించుకోవడం సంతోషకరమని అన్నారు. ప్రజల మధ్య ఐక్యత ఉండటం వల్లనే శాంతి నెలకొంటుందని అలాంటప్పుడే ఇటువంటి మంచి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం సంఘ పెద్దలు, గ్రామస్తులను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అభినందించారు. ముందుగా చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరిచర్ల విజయ నరసింహరాజు, సర్పంచ్ రావూరి లాజరస్, పాస్టర్లు కొట్టి కుటుంబరావు, పుచ్చకాయల యాకోబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ చౌదరికి పరామర్శ

వీరవాసరం: అండలూరు ఎంపీటీసీ బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి మాతృమూర్తి నాగరత్నం ఇటీవల మరణించారు. ఆయనను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పరామర్శించారు. నాగరత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్, వీరవాసరం మండల అగ్రికల్చర్ కమిటీ చైర్మన్ గొలగాని సత్యనారాయణ, భీమవరం మండల అగ్రికల్చర్ కమిటీ చైర్మన్ కొట్టు కుటుంబరావు, తోలేరు ఉప సర్పంచ్ భోగిరెడ్డి శ్రీనివాస్, బీజీ పాలెం నాయకుడు ఇళ్ళ శ్రీనివాస్, పార్టీ నౌడూరు గ్రామ అధ్యక్షుడు దేవిరెడ్డి గోపాలకృష్ణ, నౌడూరు నాయకులు యార్లబండి ఏడుకొండలు, చింతపల్లి కొండ, వీరవాసరం సొసైటీ చైర్‌పర్సన్ కె.గౌరీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు


వైవీ సుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు

కాళ్ల: టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు శుభాకాంక్షలు తెలియజేశారు. సుబ్బారెడ్డి రాజ్యసభ సభ్యునిగా నామినేషన్ వేస్తున్న సందర్భంగా సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసినట్లు శ్రీనివాసరాజు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తున్నారని కొనియాడారు.

భగవద్గీత విశిష్టతను తెలుసుకోవాలి


పాందువ్వలో ప్రచారం నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

ఉండి: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీత విశిష్టతను భక్తులు తప్పకుండా తెలుసుకోవాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక భీమవరం అధ్యక్షుడు ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పాందువ్వలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై బృందం సభ్యులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు నాగేశ్వరరావు, వాసుదేవ, చక్రధర్‌రావు, తారకేశ్వరి, సుజాత, సత్యనారాయణ, రాము, లోకేష్, శ్రీకర్, చైతన్య, లక్ష్మీరేఖ, యశోధ, దుర్గాభవాని, భానుమతి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్యను కలిసిన బీసీ నాయకులు


ఎంపీ ఆర్.కృష్ణయ్యను కలిసిన కోడే యుగంధర్ తదితరులు


భీమవరం(ప్రకాశం చౌక్): రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను హైదరాబాద్‌లో పశ్చిమగోదావరి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోడే యుగంధర్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు ముద్దాడ గణేష్ భవాని, పాలకొల్లు, భీమవరం, యలమంచిలి అధ్యక్షులు పితాని సత్యనారాయణ, కడలి ధర్మారావు, పొన్నమండ ముత్యాలరావు కలిశారు. ఈ సందర్భంగా చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్‌లు వెంటనే అమలు చేయాలని, విద్యావ్యవస్థలో సేవలు పెంపుపై పార్లమెంట్ సమావేశంలో ప్రస్తావించాలని ఆయనను కోరినట్లు కోడే యుగంధర్ తెలిపారు.

మట్టి ట్రాక్టర్‌లతో ప్రజల బెంబేలు


పెదలంకలో వెనుక డోర్ వేయకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

నరసాపురం రూరల్: పంట చేలు, ఆక్వా చెరువుల మట్టిని తరలించే ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు, ప్రయాణీకులు బెంబేలెత్తుతున్నారు. ట్రాక్టర్‌లకు వెనుకవైపున ఉండే డోర్ మూయకుపోవడంతో రోడ్లపై మట్టి గడ్డలు పడి ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అనుమతుల్లేకుండా, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా చేస్తుండడంతో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పంట బోదె పూడికతీత


కేపీపాలెం నార్త్‌లో పంట బోదెలో పూడిక తీస్తున్న కూలీలు

మొగల్తూరు: తీర ప్రాంత గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. కేపీపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం సౌత్, మొగల్తూరులోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం గ్రామాల్లోని శివారు ప్రాంతాలకు సాగు నీరందేలా పంట బోదెల్లో పూడిక తీస్తున్నారు. సోమవారం కేపీపాలెం నార్త్ గ్రామంలో పంట బోదెలో నిలిచిపోయిన మట్టి, గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టినట్టు ఏపీఎం వెంకటేశ్వరరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు ప్రాధాన్యం


భీమవరంలో ఉమాబాలకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

భీమవరం: వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీ మహిళ గూడూరి ఉమబాలకు అవకాశం కల్పించడం అభినందనీయమని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సెల్ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ అన్నారు. సోమవారం భీమవరంలో ఉమాబాలను కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలకృష్ణ, పార్టీ వీవర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బల్ల పరమేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవుల కేటాయింపులో పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. ఉమాబాలకు సముచిత స్థానం కలిపించడమే కాక ఏలూరు, రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానాల్లో కూడా బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం విశేషమన్నారు. ఇప్పటి వరకు బీసీలను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మోసం చేయడమే కాక మరోసారి మోసగించటానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు టీడీపీకి తగిన గుణపాఠం చెప్పాలని బాలకృష్ణ, పరమేశ్వరరావు పిలుపునిచ్చారు.

కేంద్రం విధానాలతో రైతులకు తీవ్ర నష్టం


మాట్లాడుతున్న సుబ్బారావు

భీమవరం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతులు, కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు రెండో రోజు సోమవారం క్లాత్ మర్చంట్స్ భవనంలో జరిగాయి. ఈ సందర్భంగా సుబ్బారావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ దేశంలో బీజేపీ దివాళాకోరు విధానాలతో రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, పంటలకు గిట్టుబాటు ధరలు, కార్మికులకు కనీస వేతనాలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ధనాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతూ ప్రజలపై విపరీతమైన ధరల భారాన్ని మోపుతున్నారన్నారు. ఈనెల 16న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టే గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ప్రజలంతా వ్యతిరేకించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, కార్యదర్శి వర్గ సభ్యులు టి.గోపాల్, పి.రంగారావు, సీహెచ్ సైదులు, ఎం.రామాంజనేయులు, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణతకు కసరత్తు

ఆకివీడు: పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఆయా పాఠశాలల వద్ద విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఎ.రవీంద్ర సోమవారం చెప్పారు. మండలంలోని అన్ని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8.30 నుంచి 9.30 వరకు, సాయంత్రం స్కూల్ వదిలిన తరువాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్నామన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కొంత మంది విద్యార్థుల్ని దత్తత తీసుకుని విద్యాబోధన చేస్తున్నారని ఎంఈఓ వివరించారు. విద్యార్థులు చదువుతున్న తీరును ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేస్తూ, వారి ద్వారా కూడా విద్యార్థులకు మరింత ప్రోత్సాహాన్ని అందించేలా కృషి చేస్తున్నామన్నారు.

స్పందనకు 11 ఫిర్యాదులు

ఆకివీడు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'స్పందన' కార్యక్రమంలో 11 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని నగర పంచాయతీ లైబ్రరీ ప్రాంతం ఆక్రమణలకు గురైందని, లైబ్రరీ మూసివేయడంతో దానిలోని విలువైన పుస్తకాలు ఏమయ్యాని ఫిర్యాదు వచ్చినట్లు, స్థల వివాదం, ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు, ఆయా ఫిర్యాదుల్ని సంబంధిత అధికారులకు బట్వాడా చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠపై ఘర్షణ


అమ్మవారి విగ్రహం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక రామయ్యహాలులో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనపై ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడింది. 11వ వార్డు రామయ్య హాలులో ఆదివారం వీరాస్వామివార్ల సంబరం నిర్వహించారు. ఈ సంబరంలో ఒక మహిళకు అమ్మవారు కనిపించి ఈ ప్రాంతంలో ఉన్న చెరువులో తానున్నట్టు చెప్పడంతో, భక్తులు చెరువు వద్దకు వెళ్లి గుర్రపు డెక్కను తొలగించి వెతకగా అమ్మవారి విగ్రహం దొరికింది. ఆ విగ్రహానికి పూజలు చేయడం ప్రారంభించారు. ఇక్కడ విగ్రహం పెట్టడం కుదరదని సమీప పేటలో ఉన్న కొందరు క్రిస్టియన్లు గొడవ చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. విగ్రహాన్ని స్వాధీనం చేసుకుని భద్రపరిచారు. తగాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆ ప్రాంతంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని సీఐ కె.మంగాదేవి తెలిపారు. తమ అనుమతులు లేకుండా మునిసిపల్ స్థలంలో కట్టడాలు, ప్రతిష్ఠాపనలు చేయరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతం ప్రశాంతంగా ఉందన్నారు.

శివాలయంలో పండుగ పనులకు నాంది


పూజలు చేస్తున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

ఉండి: ఉండి రాజులపేటలో వేంచేసి యున్న పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి, స్వయం భూ మహిషాసుర మర్ధిని అమ్మవారి ఆలయంలో పలు కార్యక్రమాలను పురస్కరించుకుని సోమవారం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు చేతుల మీదుగా పనులకు నాంది పలికారు. అర్చకుడు సన్నిధిరాజు చలపతి ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరిరాట వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి ఆలయంలో ఉన్న సరస్వతి అమ్మవారి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 24న ఆలయంలో నూతనంగా నిర్మించిన గీతా మందిర్ ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వచ్చేనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు సన్నిధిరాజు కృష్ణ, శేషగిరి, టి.కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యతను రూపుమాపాలి


మానవ హక్కులపై అవగాహన కల్పిస్తున్న రావూరి బాలరాజు

భీమవరం అర్బన్: సమాజంలో నిరక్షరాస్యతను రూపుమాపాలని ప్రపంచ మానవ హక్కుల కౌన్సిల్ చైర్మన్ రావూరి బాలరాజు పిలుపునిచ్చారు. భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంతకం నేర్చుకుని చదివే విధంగా ఉండాలని చదవలేని వాళ్లు ఉంటే వారిని సాయంకాలం బడిబాట పేరుతో విద్యనందించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎవరైనా చదువుకోకపోతే విద్యార్థులే నేర్పించాలన్నారు. అప్పుడే సమాజ స్థాపన జరుగుతుందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, అర్హులైన వారు ఓటు హక్కును కలిగియుండాలన్నారు. ఓటును వజ్రాయుధంలా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలలో 100 శాతం పోలింగ్ జరగడం లేదని, అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల కౌన్సిల్ ఏపీ చైర్మన్ పత్రిపాటి శ్రీను, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్, సర్పంచ్‌లు కోళ్ల బాలకృష్ణ, చిల్లే వెంకటేష్, ఎంపీటీసీ కేతా నాగమణి, ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ ప్రచార మహోత్సవాలు


కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలోని పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్దన స్వామివార్ల దేవస్థానం నందు హిందూ ధర్మ ప్రచార మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ముత్తయిదువులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మయూరి కూచిపూడి నృత్య అకాడమీ కళాకారుల నాట్య ప్రదర్శన అబ్బురపరిచింది. దేవస్థానం ధర్మకర్తలు కూర్మదాసు సత్య శ్రీనివాస్, నాచు శ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు, చెల్లబోయిన సూర్యప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో పర్యవేక్షించారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం

వీరవాసరం: వీరవాసరం 1వ వార్డు అరుంధతి పేట రహదారిలో అక్రమ నిర్మాణాన్ని పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. ఈ రహదారిలో ఇటీవల ఒక వ్యక్తి ఇంటి నిర్మాణానికి పూనుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు ఇటీవల రహదారిలో ఇంటి నిర్మాణం చేపట్టవద్దని హెచ్చరించారు. అధికారులు మాట లెక్కచేయని సదరు వ్యక్తి సోమవారం తిరిగి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న అధికారులు నిర్మాణ పనులు అడ్డగించి స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ రహదారిలో సుమారు 20 మంది కొన్నేళ్లుగా తాత్కాలిక ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. మూడేళ్ల క్రితం వీరందరికీ ప్రభుత్వం జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. దీంతో గతంలో పంచాయతీ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు అందజేసి ఆక్రమిత స్థలాలను ఖాళీ చేయాల్సిందిగా ఆదేశించారు. మిగిలిన ఆక్రమణదారులపై కూడా చర్యలు తీసుకుని అరుంధతి పేటకు వెళ్ళే రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పంచాయతీ విస్తరణ అధికారి విద్యాసారధి తెలిపారు.

నరసాపురంలో జనసేన నీచరాజకీయాలు


కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పిన నాగరాజు

నరసాపురం: నరసాపురం నియోజకవర్గంలో జనసేన నీచ రాజకీయాలు చేస్తోందని అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మత్స్యకార కార్యకర్తలు కొందరు తమ సామాజిక వర్గ సమస్యపై చర్చించేందుకు జనసేన కన్వీనర్ బొమ్మిడి నాయకర్ వద్దకు వెళ్లగా వారికి జనసేన కండువాలు కప్పి, తమ పార్టీలో చేరినట్టు తప్పుడు ప్రచారం చేయించుకున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఒడుగు రామకృష్ణ, ఒడుగు నాగరాజు, ఒడుగు నర్సింహస్వామి, వల్లభాని సుబ్రహ్మణ్యం తదితరులకు తన నివాసంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పిన నాగరాజు జనసేనతీరును తప్పుపట్టారు. మత్స్యకారులు జనసేన వైపు ఉన్నారని భ్రమ కల్పించేందుకు ఆ పార్టీ నాయకులు తంటాలు పడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో మత్స్యకార సామాజికవర్గమంతా వైఎస్సార్‌సీపీ వైపు, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుకు అండగా ఉన్నారని వివరించారు. జనసేన నాయకర్ ఇలాంటి చీఫ్ ట్రిక్స్ మానుకోవాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండాయని వివరించారు. స్థానికంగా ముదునూరి ప్రసాదరాజు మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు.

కాటన్ పార్కులో పర్యాటకుల సందడి


పర్యాటకులతో కళకళలాడుతోన్న కాటన్ పార్కు

నరసాపురం: నరసాపురం పట్టంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న కాటన్‌పార్కు పర్యాటకులతో కళకళలాడుతోంది. ఈ పార్కుకు వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. వారాంతాలు, సెలవు దినాల్లో పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఈ పార్కుకు వచ్చి ఇక్కడి అందాలను వీక్షిస్తూ.. సేదతీరుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిగా మూతపడ్డ కాటన్ పార్కుపై నేటి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టిపెట్టి రూ.1.14 కోట్లు ప్రణాళికా అభివృద్ధి సంఘం నిధులతో గత ఏడాది అభివృద్ధి చేయించారు. మున్సిపాలిటీ కూడా కొంతమేర జనరల్ ఫండ్స్ కేటాయించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. నరసాపురం పట్టణంలో రెండు ప్రధాన పార్కులు ఉన్నాయి. ఇందులో ఒకటి కాటన్ పార్కు కాగా, మరొకటి శారద థియేటర్ వద్ద బాలయ్యపార్కు.

కాలనీవాసుల వంతెన కల నెరవేరింది


గోస్తనీ నదిపై నిర్మించిన మల్లిపూడి వంతెన

పెనుమంట్ర: మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవతో పెనుమంట్ర మండలం మల్లిపూడి ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీ వాసుల రహదారి సమస్యకు మోక్షం లభించింది. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నాటి అత్తిలి ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం నిమిత్తం మల్లిపూడి గ్రామంలో రామేశ్వరం, జుత్తిగ మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న గోస్తనీ ఆవతల గట్టున నాలుగున్నర ఎకరాల స్థలం సేకరించి, మల్లిపూడి గ్రామ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ స్థలాలకు వెళ్లాలంటే మల్లిపూడిలోని వేణుగోపాలస్వామి గుడి నుంచి నత్తా రామలింగేశ్వరస్వామి గుడికి వెళ్లే పుంత రహదారి నుంచి సుమారు కిలో మీటరు ప్రయాణించాలి. దీంతో అప్పట్లో జుత్తిగ వద్ద గోస్తనీనదిపై వంతెన నిర్మిస్తానని శ్రీరంగనాథరాలజు కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అయితే అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ వంతెన సమస్యను పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో ఆచంట ఎమ్మెల్యేగా ఎన్నికై న శ్రీరంగనాథరాజు ఇదే కాలనీలో మరో ఎకరం 20 సెంట్ల స్థలం కొనుగోలు చేసి జగనన్న లబ్ధిదారులు 40 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. దీంతో ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో 180 మంది వరకు పట్టాలు ఇవ్వగా, సుమారు 150 మంది గృహాలు నిర్మించుకున్నారు. ఇక్కడ రూ.24 లక్షల ప్రభుత్వ నిధులతో వంతెన నిర్మించారు. దీంతో లబ్ధిదారులు ప్రధాన రహదారికి వెళ్లేందుకు దగ్గర మార్గం ఏర్పడింది. ఫలితంగా స్థలాల విలువా పెరిగింది. ఈ వంతెనను మంగళవారం ప్రారంభించనున్నారు.

అభివృద్ధి పనులు

యలమంచిలి: రెండో విడత గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో యలమంచిలి మండలం బాడవ గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న స్థానిక కాపు కల్యాణ మండపం చుట్టూ రూ.10 లక్షలతో ప్రహరీ, గెల్లు వారి వీధిలో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు, మరో రూ.5 లక్షలతో నాగమ్మ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులను వైఎస్సార్ సీపీ నాయకులు ఇలపకుర్తి నరసింహారావు (పండు), వినుకొండ మాణిక్యాలరావు (చిన్న), రావూరి రామకృష్ణ, గెల్లు చంద్రరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అడబాల వెంకటలక్ష్మి సోమవారం పరిశీలించారు.

డీఎన్నార్ కళాశాలలో అదనపు కోర్సులు


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

పాలకొల్లు సెంట్రల్: కళాశాలలో సాధారణ విద్యతోపాటు అదనపు కోర్సులు బోధించనున్నట్టు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. సోమవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు కోర్సులపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో శోభారాణి మాట్లాడుతూ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్, రాజనీతి శాస్త్రం, తెలుగు శాఖలో వరుసగా కరాటే, గాంధీ ఎస్ స్టడీస్, తెలుగు జర్నలిజంలో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించామని తెలిపారు. డిగ్రీ ఫైనల్ ఇటర్ విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య ఖర్చులకు వితరణ

పాలకొల్లు అర్బన్: స్థానిక వసుధ ఫౌండేషన్ కార్యాలయంలో పలువురికి వైద్య ఖర్చుల నిమిత్తం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ఆదేశాల మేరకు పలువురు రోగులకు సోమవారం ఆర్థిక సాయం అందించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్న పోడూరు మండలం పెనుమదం గ్రామానికి చెందిన ఎ.దేవీప్రసాద్‌కు రూ.10 వేలు చెక్కు, మొగల్తూరు మండలం తూర్పుతాళ్ల గ్రామానికి చెందిన అద్దాల వరలక్ష్మి వైద్య ఖర్చులకు రూ.7 వేలు, పేరుపాలెం గ్రామానికి చెందిన సత్యభరణి లీలావతికి రూ.7 వేల చెక్కులను కన్వీనర్ బుద్ధరాజు చేతుల మీదుగా అందజేశారు.